క్లుప్తంగా

ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణం కల్పిస్తాం



కోడూరు: న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారికి ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణం కల్పించనున్నట్లు ఎస్‌ఐ చాణిక్య తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ శుక్రవారం స్టేషన్ లోపల, బయట పరిస్థితులను పరిశీలించారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చేవారి కోసం ప్రత్యేక టేబుల్స్‌ను ఏర్పాటు చేయించారు. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చేవారితో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు సహకరించాలని ఎస్‌ఐ సూచించారు. అక్రమ మద్యం, రేషన్, మట్టి రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రత్యేక గస్తీ చేపట్టనున్నట్లు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

రవికుమార్‌కు డాక్టరేట్



కోనేరుసెంటర్: కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఎస్.రవికుమార్ డాక్టరేట్ పట్టా పొందారు. క్లౌడ్ ఇంటిలిజెన్స్ డెవలప్‌మెంట్‌పై చేసిన పరిశోధనకు సంబంధించి కృష్ణా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ సాధించారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కె.చంద్రశేఖర్‌అయ్య పర్యవేక్షణలో ఆచార్య వైకే సుందరకృష్ణ సహపర్యవేక్షణలో అనంతపురానికి చెందిన రవికుమార్ డాక్టరేట్ పట్టా పొందారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



మోపిదేవి: మోపిదేవిలో 216 జాతీయ రహదారిపై కొక్కిలిగడ్డ బస్‌షెల్టర్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో చెన్ను శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది ఘటనా స్థలంలో క్షతగాత్రులను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాపట్ల జిల్లా నిజాంపట్నంకు చెందిన చెన్ను శ్రీనివాసరావు మచిలీపట్నం వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొనడంతో శ్రీనివాసరావు తలకు గాయాలయ్యాయి. రక్తపుమడుగులో పడి ఉన్న ఆయనను ఆ దారిలో వెళుతున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు వెంకట్రామ్ క్షతగాత్రులను త్వరితగతిన హాస్పటల్‌కు తరలించారు. రెండో వాహనంపై ఉన్న ఇరువురికి కూడా దెబ్బలు తగిలినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

‘ఎస్సీ వర్గీకరణ క్రిమీలేయర్‌ను అడ్డుకుంటాం’



దేవరకోట(ఘంటసాల): ఎస్సీ వర్గీకరణ క్రిమీలేయర్ అడ్డుకుంటామని, ఇందు కోసం డిసెంబర్ 22న జరిగే చలో విజయవాడను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏపీ అధ్యక్షుడు పంతగాని రమేష్ అన్నారు. మండలంలోని దేవరకోట, ఘంటసాల గ్రామాలలో మాల మహానాడు, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏపీ అధ్యక్షుడు రమేష్ శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు, దివంగత పీవీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా మాల ఉద్యోగుల సంఘం నాయకులు సీహెచ్.ప్రసాద్, ఎస్.రాకేష్, మండల నాయకులు మద్దాల నాగార్జున, శ్రీనివాస్, కొప్పుల అఖిలేష్, పాల్గొన్నారు.

మహిషాసురమర్దనీ.. రక్షమాం


మహిషాసురమర్దనిగా నాగాయలంక కనకదుర్గాదేవి


కొక్కిలిగడ్డలో శ్రీమహిషాసురమర్దనిగా


బందరు మండలం ఎస్ఎన్ గొల్లపాలెంలో..



మహిషాసురమర్దనిగా కోడూరు గంగాభవానీ


శ్రీకాకుళంలోశ్రీ మహిషాసురమర్దనిగా..


మచిలీపట్నం గీతామందిరంలో ..


చోరంపూడి శ్రీవీర్లంకమ్మదేవీ మందిరంలో..


శ్రీమహిషాసురమర్దనీదేవిగా పెడన పైడమ్మ


అవనిగడ్డ లంకమ్మ ఆలయంలో..


నాగాయలంక కన్యకాంబ ఆలయంలో పూజలు


కృత్తివెన్ను మండలం నీలిపూడిలో మహిషాసురమర్దనిగా అమ్మవారు

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం అమ్మవారిని శ్రీ మహిషాసురమర్దనీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. కుంకుమ పూజలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

–మచిలీపట్నంటౌన్/పెడన/అవనిగడ్డ/బంటుమిల్లి/నాగాయలంక/ఘంటసాల/మోపిదేవి/కృత్తివెన్ను/కోడూరు

ఆక్రమణల తొలగింపులో వివక్ష

- పెద్దలకు ఒక న్యాయం.. పేదలకు ఒక న్యాయమా..
- 22 ఎకరాల మడుగు పోరంబోకును 18.25 ఎకరాలుగా చూపుతున్న అధికారులు
- మూడు ఎకరాల్లో పేదలు నిర్మించుకున్న గృహాల తొలగింపు
- మిగిలిన భూమిలో ఆక్రమిత ఇటుక బట్టీలను తొలగించని వైనం
- అధికారులు, కూటమి పెద్దల తీరుపై అనుమానాలు


పేదల గృహాలు తొలగించిన ప్రాంతంలో ఉన్న ఇటుక బట్టీలు

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పెద్దలకు ఓ న్యాయం.. పేదలకు ఓ న్యాయం చేస్తోందనే ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి. దీనికి నగరంలోని 41వ డివిజన్ పరిధిలో ఉన్న కుమ్మరిగూడెంలోని మడుగు పోరంబోకు – కుమ్మరిచెరువు ఘటనపై నగర ప్రజలు చర్చించుకోవడమే కారణం.

జరిగింది ఇదీ..

ఆ ప్రాంతంలో ఆర్‌ఎస్ నంబర్ 180, 181లో ఉన్న మడుగు పోరంబోకు – కుమ్మరిచెరువు ప్రభుత్వ భూమి అని, దీనిని ఆక్రమిస్తే అలాంటి ఆక్రమణలను తొలగిస్తామని సెప్టెంబరు 19న నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ప్రకటన ఇచ్చిన ఆరవ రోజు తెల్లవారుజామున ఈ స్థలంలో పేదలు నిర్మించుకున్న రేకులషెడ్లను నగరపాలక సంస్థ అధికారులు జేసీబీల సాయంతో నేలమట్టం చేశారు.

మొత్తం విస్తీర్ణం ఎంతో..?

ఈ మడుగు పోరంబోకు ప్రాంతంలో దాదాపు 22 ఎకరాల ప్రభుత్వభూమి ఉండగా అధికారులు మాత్రం 18.25 ఎకరాలు ఉన్నట్లుగా చూపారు. ఈ భూమిలో దాదాపు 3 ఎకరాల్లో గతంలో ఆ ప్రాంతంలో ఉన్న ఇటుకబట్టీల్లో, ఇతర కూలి పనులు చేసుకునే పేదలు దాదాపు 200 గృహాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ గృహాలన్నింటినీ యుద్ధప్రాతిపదికన నగరపాలక సంస్థ అధికారులు దగ్గరుండి మరీ నేలమట్టం చేయించారు.


మడుగు పోరంబోకు ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే శిక్షార్హులని కమిషనర్ ఏర్పాటు చేయించిన బోర్డు

వ్యాపారులకు మినహాయింపా..?

మడుగు పోరంబోకు భూమిలో దాదాపు 25 మంది బడా వ్యాపారులు ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. సొంత భూమిలా ఇటుకబట్టీలను యధేచ్ఛగా నిర్వహిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. సెప్టెంబరు 19వ తేదీన ఇచ్చిన నోటీసులో మడుగు పోరంబోకు భూమిలో ఉన్న అన్ని ఆక్రమణలు చట్టవిరుద్ధమని, యజమానులే తొలగించాలని హెచ్చరించారు. అయితే మూడు ఎకరాల్లో పేదలు వేసుకున్న గృహాలే నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. మిగిలిన ఎకరాల్లో పెద్ద పెద్ద ఇటుక బట్టీలు మాత్రం వారికి కనపడ లేదు. దీంతో నగరపాలక సంస్థ అధికారులు పేదలకు ఓ న్యాయం, పెద్దలకు ఓ న్యాయం చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినవస్తున్నాయి.

అధికారులు, కూటమి పెద్దల తీరుపై అనుమానాలు

మడుగు పోరంబోకులో పేదలు గత ప్రభుత్వ హయాంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారనే అక్కసుతో కూటమి పాలకులు వీటిని తొలగించేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. బడా వ్యాపారుల ఇటుకబట్టీలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటాన్ని ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తమ నివాసాలు ఎప్పటికైనా తొలగిస్తామని, అయితే ప్రతి లబ్ధిదారునికి రెండు సెంట్ల స్థలం, రూ. 4 లక్షలతో పక్కాగృహం, గృహాల తొలగింపునకు నష్టపరిహారం అందజేస్తానని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర కుమ్మరిగూడెంలోని రామాలయం వద్ద హామీ ఇచ్చారని, కానీ హామీని మంత్రి విస్మరించి తమ గూడును కూలగొట్టారని బాధితులు వాపోతున్నారు.

మా గూడెంపై ఎందుకీ కక్ష



స్టేడియం నిర్మాణానికి అప్పట్లో స్థలం ఇవ్వని కారణంగా కుమ్మరిగూడెం ప్రజలపై మంత్రి కొల్లు రవీంద్ర కక్ష కట్టారు. అందుకే మా నివాసాలు కూల్చారు. రూ.5 లక్షలతో నివాసాన్ని ఏర్పాటు చేసుకుని ఫిబ్రవరి నెల నుంచి నివాసం ఉంటున్నా. కమిషనర్ వచ్చి పరిశీలించిన తరువాతే నా గృహానికి పన్ను వేశారు. కరెంటు కనెక్షన్ ఇచ్చారు. 24 గంటల్లో ఒక్కసారిగా ఇల్లు నిర్మించుకోలేదు. అందరి సమ్మతితోనే నిర్మించాం. కానీ నేటి పాలకులు కక్ష కట్టి ఇళ్లు కూల్చటం దారుణం. ఇదే మడుగు పోరంబోకులో మాలాగే ఇటుక బట్టీలు అలాగే ఉన్నాయి. ఇది ఎంత వరకు కరెక్ట్.

–పొంద్రాక శ్రీనివాసరావు, కుమ్మరిగూడెం

21, 22 తేదీల్లో జాతీయ రైతు సదస్సు


సమావేశంలో రైతు సంఘు నాయకులు

బంటుమిల్లి: వ్యవసాయ రంగ సమస్యలపై ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ రైతు సదస్సును విజయవంతం చేసేందుకు రైతు నాయకులు కృషి చేయాలని జిల్లా రైతు సంఘ కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మండల రైతు సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల తుఫాను వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధరలు, పెరుగుతున్న పెట్టుబడులు తదితర అంశాలపై సదస్సులో నాయకులు చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు నాగేశ్వరరావు పేర్కొన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల నుంచి రైతులు సదస్సు విజయవంతానికి కృషి చేయాలని ఆయన కోరారు. రైతు సంఘ నాయకులు ఎస్.జనార్దన్‌రావు, ఎం. శివరామ్, ఎల్.అజయ్‌ఘోష్, వీరబాబు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

జయప్రకాష్ నారాయణకు నివాళి

మచిలీపట్నంటౌన్: లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ జయంతిని శుక్రవారం స్థానిక నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. జయప్రకాష్ నారాయణ చిత్రపటానికి మిత్రమండలి కో కన్వీనర్ ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తితో పాటు పలువురు సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. బందిపోటు దొంగల్లో పరివర్తన తీసుకువచ్చి జనజీవన స్రవంతిలోకి తెచ్చిన గొప్ప సామాజిక కార్యకర్త జయప్రకాష్ నారాయణ అని వారు కొనియాడారు. రాజశేఖర్, పీవీ ఫణికుమార్, కొండా ప్రసాద్, ఎల్‌వీసీ శర్మ, జయప్రసాద్, సుబ్బారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.


జయప్రకాష్ నారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

[illegible]

అలరించిన ఇంద్రధనస్సు

ఇంద్రధనస్సు కనువిందు చేసింది. మండల కేంద్రం మోపిదేవిలో ఇంద్రధనస్సు ప్రకృతి ప్రేమికులను అలరించింది. శుక్రవారం సాయంత్రం సన్నటి చినుకులు, కారుమబ్బుల నడుమ ఆకాశంలో చిరు ఎండలో ఏడు రంగుల ఇంద్రధనస్సు పరవశింపజేసింది. రెండు బిల్డింగ్‌ల పైన నిలబడినట్టుగా ఈ ఇంద్రధనస్సు వారధిగా అందరినీ ఆకట్టుకుంది. –మోపిదేవి


కనువిందు చేసిన ఇంద్రధనస్సు

120 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న హాస్పిటల్ సిబ్బంది

ఘంటసాల: గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ కాలనీల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు దిరిశం పిచ్చేశ్వరరావు అన్నారు. ఘంటసాల పెద్దగూడెం శ్రీరామాలయం ప్రాంగణంలో అవనిగడ్డకు చెందిన ఫోకస్ కంటి హాస్పిటల్ ఎండీ కె.కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు గుర్రం నాగరాజు 120 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. 20 మందికి కళ్లజోళ్లు, 15 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో ఎం.భూమిక ఆటోమేటిక్ రిఫ్రాక్టర్ ద్వారా కళ్లను పరీక్షించగా పి.మౌనిక, సీహెచ్.ప్రవీణ సేవలను అందించారు. కె.విజయ్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిబిరంలో దిరిశం పిచ్చేశ్వరరావుతో పాటు కొడాలి గంగాధరరావు, మట్టా సోమేశ్వరరావు, కొడాలి పోతురాజు, దిరిశం మహాలక్ష్ముడు, దొండపాటి యాకోబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాత వితరణ


ట్రస్టీ ప్రవీణ్‌కు విరాళం అందిస్తున్న దాతలు నాగభరత్, శివయ్య

ఘంటసాల: ఘంటసాల–దేవరకోట గ్రామ శివార్లలోని శ్రీకోట ముత్యాలమ్మ తల్లి దేవస్థానం అభివృద్ధికి దాత నగదు వితరణ చేశారు. ఘంటసాలపాలెం గ్రామానికి చెందిన వేమూరి దుర్గా శివప్రసాద్ (శివయ్య) కుమారుడు నాగభరత్ రూ.57,500 నగదును ఆలయ ట్రస్టీ వేమూరి ప్రవీణ్‌కు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధికి సహకరించిన దాత నాగ భరత్‌కు ట్రస్టీ ప్రవీణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ముందుగా నాగభరత్ కుటుంబ సభ్యులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.